క్లుప్తంగా

కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోండి



గ్రామ సభలో మాట్లాడుతున్న రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది

సి.బెళగల్: మండల రైతులు కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ హిమబిందు సూచించారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించి కౌలు కార్డులపై మాట్లాడారు. భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకునే రైతులు కౌలు కార్డులు పొందడం వల్ల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఏఈఓ తెలిపారు. వీఆర్వో శేఖర్ మాట్లాడుతూ.. పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలకు హక్కులను కల్పించేందుకు కౌలు కార్డులు ఉపయోగాపడతాయని తెలియజేశారు. వీహెచ్ఏ శశిదేవి ఖరీఫ్ పంటల సాగు సన్నద్ధతపై రైతులకు అవగాహన కల్పించారు.

శుభకార్యం

పాణ్యం: మండల కేంద్రంలో జరిగిన పలు వివాహాలకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, భూపనపాడు సర్పంచ్ జనార్ధన్, చందమామబాబు, కరుణాకర్‌రెడ్డి, నాగేంద్ర, అనుపూరు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఈఈ శుభకుమార్

పాణ్యం: పాణ్యం–దుర్వేశిమెట్ట వరకు దాదాపు 13 కి.మీ.మేర చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్ సూచించారు. శుక్రవారం నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ నిధులతో 14 కి.మీ. దూరం బీటీ రోడ్డు, అవసరమైన ప్రదేశంలో సైడ్‌వాల్, నూతన బ్రిడ్జీలు నిర్మించినట్లు చెప్పారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. డీఈఈ గీతావాణి, ఏఈ రాహుల్ పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఓర్వకల్లు : స్థానిక ఏపీ సీడ్స్ గోడౌన్‌లో శుక్రవారం సిరి రకం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. పొగాకు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశాల మేరకు జీపీఐ కంపెనీ వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారంలో రెండు రోజుల పాటు సిరి (చుక్కబర్లి) పొగాకును కొనుగోలు చేస్తారని, మిగతా రోజుల్లో బీడి(రష్టికా)రకం పొగాకును కొనుగోలు చేస్తారని వివరించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొరాయిస్తున్న సర్వర్

కల్లూరు: వివిధ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తుకునేందుకు అర్హులు యత్నిస్తుండగా సర్వర్ మొరాయిస్తుండటంతో వారు నిరాశకు గురవుతున్నారు. గతనెల 14 నుంచి ఈనెల 10వ తేదీ లోపు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని వాటిని సంబంధిత కార్యాలయంలో అందజేయాలి. ఇందులో భాగంగా దరఖాస్తుదారులు దరఖాస్తుకు ప్రయత్నిస్తుండగా సర్వర్ పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ధ్యేయం

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేందుకు ఏపీటీఎఫ్ ఉద్యమాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, రంగన్న అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో.. ప్రభుత్వ విద్యను విస్మరించేలా తీసుకుంటున్న నిర్ణయాలపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతున్న ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. 9 రకాల బడుల వ్యవస్థను తీసుకొస్తున్న ప్రభుత్వ నిర్ణయాలు అయోమయంగా ఉన్నాయన్నారు. దీని వల్ల ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం బడులను నిర్వీర్యం చేయాలని చూస్తే పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

- ఈనెల 16 లోపు భూ యజమానులు తమ డాక్యుమెంట్లు సమర్పించాలి
- జాయింట్ కలెక్టర్ బి.నవ్య వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి నందికొట్కూరు రోడ్డులో ఉన్న శ్రీ సాయి గార్డెన్స్ వరకు 2.3 కిలోమీటర్ల పొడవున 340సీ రోడ్డు విస్తరణ పనులకు సంబంధింత భూమి యజమానులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య కోరారు. శుక్రవారం స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులు, భూమి యజమానులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం ఇదే అంశంపై సమావేశం నిర్వహించామని, భూమి యజమానుల అభ్యర్థన మేరకు 120 అడుగుల రోడ్డును 100 అడుగుల రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడం జరిగిందన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు సంబంధిత భవన, స్థల యజమానులు తమ డాక్యుమెంట్లను మున్సిపల్ కార్పొరేషన్‌లో సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్వహించిన రివైజ్డ్ వాల్యుయేషన్ ప్రకారం ఖాళీ స్థలానికి టీడీఆర్ బాండ్ల రూపంలో ఇస్తామని, అలాగే భవన యజమానులకు ప్లింత్ ఏరియా ప్రకారం ఆర్ అండ్ బీ విభాగం చేసిన వాల్యుయేషన్ ప్రకారం నగదు చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. పలువురు భవన యజమానుల అనుమానాలను జాయింట్ కలెక్టర్ నివృత్తి చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. భూమి యజమానులకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున త్వరితగతిన డాక్యుమెంట్లు సమర్పించాలన్నారు. ఇప్పటికే 90 మంది డాక్యుమెంట్లు సమర్పించారన్నారు. మిగతా వారు సైతం డాక్యుమెంట్లను నగరపాలక సంస్థకు అందజేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మురళీనాయక్ వీరమరణం దేశానికే గర్వకారణం

కర్నూలు (టౌన్): దేశ భద్రత కోసం జమ్మూకశ్మీర్‌లో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరువదని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి భగవంతుడు శక్తి, ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. భారతదేశం తన శక్తిని ప్రపంచానికి చూపించిందని, మన దేశాన్ని విడదీయాలని ప్రయత్నించిన వాళ్లకు తగిన బుద్ధి చెప్పారన్నారు. భారత సైన్యం ధైర్యంగా, తెలివిగా శత్రు స్థావరాలను ధ్వంసం చేసిందని, మన జవాన్లు భారత దేశాన్ని కాపాడారని పేర్కొన్నారు. భారత్ ఎప్పుడు తలవంచదు, ఎప్పుడూ వెనకడుగు వేయదు. శాంతిని కోరుకుంటాం.. అవసరమైతే దిమ్మతిరిగే గుణపాఠం చెబుతుందని స్పష్టం చేశారు.

ఆర్మీ జవాన్ ప్రాణత్యాగం వెలకట్టలేనిది

కర్నూలు(అగ్రికల్చర్): దేశ భద్రతలో తన ప్రాణాలను తృణప్రాయంగా భావించిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ త్యాగం ఎన్నటికీ మరువలేనిదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కై లాస్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని లంబాడి హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భారత్ – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న పోరులో ఈ నెల 8న మురళీనాయక్ వీరమరణం పొందారన్నారు. మురళీనాయక్‌కు దేశ బంజారా, గిరిజన లంబాడి ప్రజలు శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. లంబాడి హక్కుల పోరాట సమితి నేతలు నాగరాజునాయక్, రామాంజనేయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు అప్రజాస్వామికం



రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు



గడివేములలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

ఓర్వకల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తుండటంతో కక్షసాధింపు చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో వారెంట్ ఇవ్వకుండా సోదాలు చేయడం అప్రజాస్వామికమని విలేకరులు ఖండించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులు ప్రభుత్వ పెద్దలకు వంత పాడుతున్నారని, కలం గొంతును నొక్కేసే చర్యలకు పాల్పడుతుండటం సరికాదన్నారు. విలేకరులు భాస్కర్‌రావు, గోపాల్, విరూపాక్షి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజరెడ్డి ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అని పాత్రికేయులు ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా గడివేముల తహసీల్దార్ వెంకటరమణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.విలేకరులు మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించి సోదాలు చేయడం దారుణమన్నారు. విలేకరులు సోపిసాహేబ్,ఎల్లసుబ్బయ్య, మస్తాన్, ప్రసాద్,హరున్ పాల్గొన్నారు.

ఆర్‌యూలో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీసీ సంఘాల నాయకులు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న విద్యార్థులను వర్సిటీ నుంచి సస్పెండ్ చేయాలని, విద్యార్థులను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పుతున్న ప్రొఫెసర్లు, టీచింగ్ స్టాఫ్‌పై చర్యలు తీసుకొని ఉద్యోగాల నుంచి తొలగించాలని, పాఠాలు బోధించకుండా కాలక్షేపం చేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వీసీకి విన్నవించారు. బీసీ సంఘం జాతీయ నాయకులు నకల్కమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు శేషఫణి యాదవ్, రాంబాబు, మహిళా నాయకులు పట్నం రాజేశ్వరి, నంది విజయలక్ష్మి, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.

నగరపాలక ఎస్ఈ బదిలీ

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.రాజశేఖర్‌పై బదిలీ వేటు పడింది. శుక్రవారం రాత్రి ఆయన్ను చీఫ్ ఇంజినీర్ వద్ద రిపోర్టు చేయాలని సూచిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్‌కుమార్ జీఓ 408 జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టులో ఇన్‌చార్జ్‌ను నియమించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా గతేడాది నవంబర్ 24వ తేదీన టిడ్కో ఎస్ఈగా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు కల్చరల్: జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ, బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల చెక్‌పోస్ట్‌లో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీరాములు యాదవ్, సాయి ప్రదీప్ మాట్లాడుతూ.. బీసీల హక్కులు, వారి అభ్యున్నతి మోదీతోనే సాధ్యమన్నారు. మోదీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, నాయకులు, ప్రజలు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాయకులు వెంకటేష్, డాక్టర్ నాగేంద్ర, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి



తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తైక్వాండో శిక్షణలో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దపాడు మోడల్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోచ్ షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణలో ప్రతి ఏడాది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారన్నారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ క్రీడల సాధన వల్ల ఆరోగ్యానికి మంచిదని సూచించారు.

వేసవి శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం సెపక్‌తక్రా, తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శిబిరాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో శిక్షణ తీసుకోవడం వల్ల విద్యార్థినీ, విద్యార్థులు మానసికంగా ధైర్యంగా, దృఢంగా తయారవుతారన్నారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. తైక్వాండో శిక్షణ శిబిరం నిర్వాహకులు వీరేష్, సెపక్‌తక్రా శిక్షకులు నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



గొయ్యి పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కమ్యూనిస్టు సంఘాల నాయకులు

కర్నూలు(రూరల్): నగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డు కింద చెన్నై – సూరత్ నేషనల్ హైవే సొరంగం పనులు చేస్తుండగా జాతీయ రహదారిని అనుకుని అకస్మాత్తుగా నేల కుంగడంతో ఏర్పడిన గొయ్యిని శుక్రవారం కమ్యూనిస్టు సంఘాలు, సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి పి.రామక్రిష్ణా రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, వారి సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. గొయ్యి ఏర్పడిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. కమ్యూనిస్టు సంఘల నాయకులు మహేష్, భద్రకుమార్, కె.శ్రీనివాసులు, బాబయ్య, కేవీ నారాయణ, ఎండీ అంజిబాబు, కర్నూలు ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఉన్నారు.

నన్నూరు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించండి



గాయపడిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న స్థానికులు

ఓర్వకల్లు: నన్నూరు వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించి, ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం నన్నూరు వద్ద లొద్దిపల్లె గ్రామానికి చెందిన ఏసయ్య రోడ్డు దాటుతుండగా ఓర్వకల్లు వైపు నుంచి బైక్‌పై వేగంగా వెళ్తున్న పూడిచెర్ల యువకుడు ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. స్థానికులు గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. నాగన్న మాట్లాడుతూ, నన్నూరు వద్ద నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు రాకపోకలు నిర్వహిస్తుంటారని..రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాటి నివారణకు ఫ్లైఓవర్ ఒక్కటే నివారణ మార్గమని చెప్పారు. ఫ్లైఓవర్ నిర్మించాలని పలుసార్లు ఆందోళనలు చేపట్టి, జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మధుసూదన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎక్సైజ్ అధికారుల మొద్దునిద్ర’

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో వైన్‌షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని అమ్ముతుంటే ఎక్సైజ్ అధికారులు చూస్తూ ఉండిపోవడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వైన్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని, సమయపాలన పాటించడం లేదన్నారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత కూడా మద్యం లభ్యమవుతుండడంతో కొందరు తెల్లవార్లు తాగేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చిన్న పిల్లలకు కూడా మద్యాన్ని అమ్ముతుండటంతో 12 ఏళ్ల పిల్లలు కూడా మద్యం రక్కసి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. మద్యం షాపుల ఎదుట రోడ్లను తాగుబోతులు బ్లాక్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. మరోవైపు మద్యం షాపులు లేని లేబర్ ఏరియాల్లోకి కేసులు కేసులు మద్యాన్ని తీసుకెళ్లి అమ్మేలా చూస్తుండటంతో ఎక్కువ మంది మద్యానికి బానిసలు అవుతున్నారన్నారు. ఆయా సమస్యలను ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పోరాటాల బాట పడతామని స్పష్టం చేశారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

ఓర్వకల్లు: స్థానిక జగనన్న కాలనీలో వీధి దీపాలు వెలిగించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో చాలా రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసులు హామిచ్చారు.

అరుణ సిందూరం



ఆస్వాదించే మనసుండాలే గానీ ప్రకృతిలో ప్రతీది మనోహరమైనదే. కర్నూలు నగరంలోని భూపాల్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో విద్యుత్ స్తంభంపై అరుణ వర్ణ సిదూరంలా కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఎరువుల డీలర్లకు కొత్త ఈ-పాస్ మిషన్లు

- ఎరువుల పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట
- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వెల్లడి



డీలర్లకు ఈ-పాస్ మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): భారత ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న అన్ని రకాల రసాయన ఎరువులను ఈ-పాస్ మిషన్‌లను వినియోగించి రైతుల బయోమెట్రిక్ ద్వారానే పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం కర్నూలు ఏడీఏ కార్యాలయం ప్రాంగణంలో కోరమాండల్ కంపెనీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలు డివిజన్‌కు చెందిన ఎరువుల డీలర్లకు లేటెస్ట్ వర్షన్‌తో కూడిన ఈ-పాస్ మిషన్లను డీఏఓ పీఎల్ వరలక్ష్మి, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించేందుకు కేంద్రం ఈ-పాస్ మిషన్ల ద్వారా ఎరువులను పంపిణీ చేస్తోందన్నారు. ఇదివరకు ఎల్‌జీరో వర్షన్ వచ్చిన ఈ-పాస్ మిషన్లు ఈ నెలాఖరు వరకే పని చేస్తాయన్నారు. లేటెస్ట్ వర్షన్ ఎల్-1తో కొత్త మిషన్లను కోరమాండల్, ప్యాక్ట్ కంపెనీలు సరఫరా చేస్తున్నాయని తెలిపారు. ప్రతి డీలరుకు ఈ-పాస్ మిషన్లు అందజేస్తామన్నారు. టెక్నికల్ ఏఓ దస్తగిరిరెడ్డి, పలువురు ఏఓలు, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉదయాన్నే పనుల్లోకి రావాలి



కోడుమూరులో ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శుక్రవారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ మోదీన్‌బాషా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. పనులు చేసే చోట కూలీలకు అవసరమైన మంచినీళ్లు, నీడ వసతి సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.300 వరకు వస్తుందని కూలీలకు సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని ఏపీఓ తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్‌డివిజన్ డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు, సి.బెళగల్, కోడుమూరు 33 కేవీ ఫీడర్లలో మరమ్మతులు, సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ వల్ల మూడు మండలాల పరిధిలో కరెంట్ కోతలుంటాయని, వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని డీఈఈ కోరారు. అలాగే శనివారం అన్ని అగ్రికల్చర్ ఫీడర్లకు ఉదయం 5 గంటల నుంచి త్రీ ఫేస్ కరెంట్ సప్లై ఇస్తున్నట్లు డీఈఈ తెలియజేశారు.

పాణ్యం : స్థానిక సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించాలన్నారు. మరమ్మతుల పూర్తి అనంతరం విద్యుత్ సరఫరా యాధవిధిగా ఉంటుందని చెప్పారు.

సి.బెళగల్: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సుకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంటూ.. మండలంలోని ఐదు 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీంతో కొత్తకోట, సి.బెళగల్, గుండ్రేవుల, పోలకల్, బురాన్‌దొడ్డి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముమ్మర సాధన







కర్నూలు మండలం గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్ శిక్షణ దృశ్యాలు

నీటి ఉపరితలంపై పడవలో దూసుకెళ్తూ సత్తా చాటడం అందరికీ తెలిసిన విషయమే అయినా జిల్లా వాసులకు అలాంటి క్రీడలు అరుదే. స్థానికంగా అందుకు తగ్గ సౌకర్యాలు లేకపోవడం, క్రీడాకారులు ఆ దిశగా ఆసక్తి చూపకపోవడంతో ఇప్పటి వరకు జిల్లా నుంచి అలాంటి క్రీడాకారులు వెలుగులోకి రాలేదు. అయితే ప్రస్తుతం జిల్లా క్రీడాకారులు పడవ పోటీల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకోసం నగర శివారులోని గార్గేయపురం చెరువులో శిక్షణ పొందుతున్నారు. ఏషియన్ గేమ్స్ పోటీల్లో డ్రాగన్ బోట్ విభాగంలో సత్తా చాటేందుకు శిక్షణ పొందుతున్నట్లు క్రీడాకారులు వెల్లడించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు